TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 51 | బుధవారం 15-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## బిహార్లో తండ్రీకొడుకుల పోరు

**అభ్యర్థులకు లాలూ టికెట్లు.. వెనక్కి తీసేసుకున్న తేజస్వి..**

**ఆర్‌జేడీ నేతల్లో కలకలం**

**పట్నా/న్యూఢిల్లీ, అక్టోబరు 14:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీ ఆర్‌జేడీలో ముసలం పుట్టినట్లు సంకేతాలు వెలువడ్డాయి. పార్టీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ టికెట్లు పంపిణీ చేయగా.. ఆయన చిన్న కుమారుడు, పార్టీ సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ వాటిని వెనక్కి తీసుకోవడం ఆర్‌జేడీ నేతలను విస్మయపరుస్తోంది. తండ్రీకొడుకుల నడుమ ఆధిపత్య పోరు బహిర్గతం కావడం ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. విపక్షాల మహాగఠ్‌బంధన్(మహాకూటమి) కూడా షాకైంది.

## హరియాణాలో మరో పోలీసు ఆత్మహత్య

**ఐపీఎస్ పూరన్ కేసులో కొత్త మలుపు**

**న్యూఢిల్లీ/చండీగఢ్, అక్టోబరు 14:** హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య కేసుపై విచారణ జరుగుతున్న తరుణంలో పెద్ద ట్విస్ట్ చోటుచేసుకుంది. రాష్ట్రంలో మరో పోలీసు అధికారి మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. సందీప్ కుమార్ అనే ఏఎసఐ రోహ్‌తక్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన తన సూసైడ్ నోట్‌లో పూరన్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఆరోపణలు చేశారు. సందీప్ కుమార్ రోహ్‌తక్ సైబర్ విభాగంలో ఏఎసఐగా పనిచేస్తున్నారు. ఆయన పూరన్‌పై నమోదైన ఓ అవినీతి కేసును దర్యాప్తు చేస్తున్నారు. 'నిజాలు' వెలుగులోకి రావడం కోసం ప్రాణత్యాగం చేస్తున్నట్లు తన మూడు పేజీల సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. సందీప్ ఆత్మహత్యకు ముందు ఆరు నిమిషాల వీడియోను కూడా రికార్డు చేశారు.

## మాగంటి సునీతకు బీఫామ్



**తొవ్వ, ప్రతినిధి. అక్టోబర్ 14:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్ పార్టీ అధినేత శ్రీ కేసీఆర్‌బి ఫామ్ అందజేశారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున 40 లక్షల రూపాయలు చెక్కు ను అందించారు. ఈ సందర్భంగా దివంగత మాగంటి గోపీనాథ్ కూతుళ్లు కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కన్నీటి మంటలు

## మాగంటి సునీత కన్నీళ్లపై డైలాగ్ వార్

- కార్యకర్తల సమావేశంలో భర్తను తలుచుకుని కన్నీళ్లు పెట్టిన సునీత
- ఆమె పట్ల సానుభూతి ఉందంటూనే.. కన్నీళ్లు పెట్టడమేంటన్న పొన్నం
- అధికారం కోసం మహిళ కన్నీళ్లనూ బీఆర్ఎస్ వాడుకుంటోంది: తుమ్మల
- భావోద్వేగాలపై విమర్శలా?.. కాంగ్రెస్ నేతలు నీతిమాలినవారు: కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబరు 14:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక యుద్ధంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత కన్నీరు.. మంటలు రేపుతోంది. బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో తన భర్త, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను తలుచుకుని సునీత పెట్టుకున్న కన్నీళ్లు, దీనిపై మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు, అందుకు బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాసగౌడ్ కౌంటర్లతో మంగళవారం ప్రచారం హీటెక్కింది. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని ఎత్తి చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల తన నివాసంలో జరిగిన సమావేశంలో పార్టీ నేతలకు సూచించారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ సెంటిమెంట్‌నే నమ్ముకుని ఎన్నికలకు దిగుతోందని, ఈ నేపథ్యంలో మాగంటి గోపీనాథ్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలకు పోవద్దని అన్నారు. అయితే సోమవారం రహమత్‌నగర్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశంలో మాగంటి సునీత తన భర్తను గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్న తీరు.. కాంగ్రెస్ నేతలను ఒక్కసారిగా ఉలిక్కిపడేట్లు చేసింది. దీంతో సునీతతో బీఆర్ఎస్ నాయకత్వం కన్నీళ్లు పెట్టిస్తోందంటూ మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రచారంలో వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోపిడీ చేశారని, మళ్లీ దోపిడీ చేయడానికి కన్నీళ్లను కూడా వదిలిపెట్టడంలేదని ఆరోపించారు. కన్నీళ్ల ద్వారా అధికారాన్ని మళ్లీ పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## బీజేపీ తొలి జాబితా సంచలనం

**కమలం పార్టీ నుంచి 71 మంది ప్రకటింపు.. ఉప ముఖ్యమంత్రులే బరిలోకి**

- మాజీ ఉప ముఖ్యమంత్రులు, మాజీ ఎంపీలకు మళ్లీ ఛాన్స్
- కాంగ్రెస్‌ను వీడి చేరిన నేతకు ప్రత్యేక బహుమతి టికెట్
- అనుభవం.. కొత్త ముఖాలకు సమ పంచే వ్యూహం



**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, బీజేపీ మొదటి దెబ్బ వేసింది. ఎన్డీఏ కూటమి సీట్ల సర్దుబాటు పూర్తికాగానే, మంగళవారం కమలం పార్టీ గర్జనలా 71 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. మొదటి జాబితాలోనే కీలక నేతలు ఉండటం, ఎన్నికలకు బీజేపీ సీరియస్‌గా సిద్ధమవుతోందన్న సంకేతాలను ఇస్తోంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రులుగా ఉన్న సామ్రాట్ చౌదరి (తారాపూర్) మరియు విజయ్ కుమార్ సిన్హా (లఖిసరాయ్) మళ్లీ బరిలోకి దిగుతున్నారు. వీరితో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రులు తార్కిషోర్ ప్రసాద్ (కతిహార్) మరియు రేణు దేవి (బెట్టియా)లకు కూడా టికెట్లు కేటాయించడం గమనార్హం. పార్టీ సీనియర్ నేతలపై నమ్మకం ఉంచిన బీజేపీ, మాజీ ఎంపీలు రామ్ కృపాల్ యాదవ్ (దానాపూర్) మరియు సునీల్ పింటూ (సీతామఢ)లను జాబితాలో చేర్చింది. 2024 లోక్‌సభలో సీట్ల సర్దుబాటు కారణంగా పింటూ పోటీ చేయలేకపోయినా, ఈసారి అసెంబ్లీ రేసులో అవకాశం ఇవ్వడం బ్యాలెన్స్ స్ట్రాటజీగా కనిపిస్తోంది. ఇక ప్రత్యేక ఆకర్షణగా మారింది – కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరిన సిద్ధార్థ సౌరవ్‌కు బిక్రమ్ స్థానం నుంచి టికెట్. నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని కాపాడిన సమయంలో కీలక పాత్ర పోషించినందుకు ఈ అవకాశాన్ని పార్టీ గుర్తింపుగా భావిస్తున్నారు. అంతర్జాతీయ షూటర్ మరియు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రేయసి సింగ్ (జమూయి), ఆరోగ్య శాఖ మంత్రి మంగళ్ పాండే (సివాన్), పరిశ్రమల శాఖ మంత్రి నితీశ్ మిశ్రా వంటి కీలక నేతలు కూడా ఈ జాబితాలో ఉన్నారు. అనుభవజ్ఞులైన నేతలతో పాటు కొత్త ముఖాలకు కూడా సమ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా బీజేపీ సమతుల్య సమీకరణాన్ని అమలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## మల్లోజుల వేణుగోపాల్‌రావు లొంగుబాటు




**గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత**

**పెద్దపల్లి, అక్టోబరు 14:** గత కొన్ని రోజులుగా వామపక్ష వాదులు, ప్రజాసంఘాల శ్రేణులు ఊహిస్తున్నట్లుగానే.. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు పోలీసులకు లొంగిపోయారు. నాలుగున్నర దశాబ్దాల ఉద్యమ, అజ్ఞాత జీవితం వీడి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట 60 మంది మావోయిస్టులతో కలిసి ఆయన లొంగిపోయారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ముగ్గురు సభ్యులు, పలు డివిజినల్ కమిటీలకు చెందిన పది మంది సభ్యులు కూడా ఉన్నారు. మొత్తం 54 ఆయుధాలతో సహా వీరు లొంగిపోయారని, ఆ ఆయుధాల్లో ఏడు ఏకే 47లు, తొమ్మిది ఇన్సాస్ రైఫిళ్లు ఉన్నాయని ఒక పోలీసు అధికారి వెల్లడించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మావోయిస్టులు వారంతటవారే లొంగిపోయేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. మహారాష్ట్రలోని హెూడ్రి అనే గ్రామం వద్ద నుంచి వారిని పోలీసు వాహనాల్లో గడ్చిరోలి పోలీసు ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చామని వెల్లడించారు. అక్కడ ఆయుధాలను అప్పగించి వారు లొంగిపోయారన్నారు. కాగా, మల్లోజుల వేణుగోపాల్‌రావు మీద రూ.6 కోట్ల రివార్డు ఉంది.

## రేపు క్యాబినెట్ సమావేశం

**బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ**



**హైదరాబాద్, అక్టోబరు 14:** రాష్ట్ర మంత్రివర్గం గురువారం (ఈ నెల 16న) సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం కానుంది. సచివాలయం ఆరో అంతస్తులోని క్యాబినెట్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, సాగునీటి పారుదల ప్రాజెక్టులు, ధాన్యం సేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు తదితర అంశాలు చర్చకు రానున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 అమలుపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ గురువారమే విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## విశాఖలో గూగుల్ ఏఐ హబ్..

**ఏపీ ప్రభుత్వంతో గూగుల్ ఒప్పందం**

- విశాఖలో హైపర్ స్కేల్ డేటా సెంటర్
- సుందర్ పిచాయ్ ఫోన్‌లో మోదీకి వివరాలు
- "ఇది మా కోసం గర్వకారణం"
- ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్‌గా వైజాగ్ గుర్తింపు దిశగా
- 88,628 కోట్ల భారీ పెట్టుబడితో వైసాఖను ఏఐ సిటీగా తీర్చిదిద్దే ప్రణాళిక



**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 14:** టెక్ ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా విశాఖపట్నంలో గూగుల్ తన తొలి ఏఐ హబ్‌ను స్థాపించేందుకు రంగం సిద్ధమైంది. రైడెన్‌తో కలిసి ఏపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఈ ఒప్పందంపై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్‌లో వివరాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ భారత్‌కు సాంకేతిక రంగంలో మైలురాయి అవుతుందని ఆయన పేర్కొన్నారు. 1 గిగా వాట్ సామర్థ్యంతో నిర్మించనున్న ఈ డేటా సెంటర్ గూగుల్‌కు ఆసియాలోనే అతిపెద్ద హబ్‌గా నిలవనుంది. క్లౌడ్ సేవలు, ఏఐ ఆధారిత ఇన్నోవేషన్‌లు, యూట్యూబ్, సెర్చ్ ఆపరేషన్లకు ఈ డేటా సెంటర్ హృదయంగా పనిచేయనుంది. పెట్టుబడులతో పాటు భారీ స్థాయి ఉద్యోగావకాశాలు, స్టార్టప్స్‌కు టెక్నాలజీ మద్దతు అందించబోతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్టుతో విశాఖ ఏఐ సిటీగా గుర్తింపు పొందే దిశగా అడుగులు వేస్తోంది. ఆధునిక డిజిటల్ సదుపాయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలతో పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు కొత్త యుగంలోకి అడుగుపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏఐ హబ్‌తో కలిసి విశాఖపట్నం కేవలం పరిశ్రమ నగరంగా కాకుండా, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారనుంది. డేటా ప్రాసెసింగ్, ఏఐ రీసెర్చ్, మెషిన్ లెర్నింగ్ మోడళ్ల అభివృద్ధికి అవసరమైన అత్యాధునిక వసతులు ఇక్కడే లభ్యం కానున్నాయి. దీనితో గ్లోబల్ టెక్ కంపెనీలు కూడా వైజాగ్ వైపు దృష్టి సారించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.డేటా సెంటర్ ఏర్పాటుతో పాటు, ఏఐ ఆధారిత సేవలకు భారత స్టార్టప్ ఎకోసిస్టమ్ మరింత బలపడనుంది. గూగుల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా టెక్ స్టార్టప్స్‌కు నేరుగా మెంటరింగ్, సాఫ్ట్‌వేర్ ఇన్ఫ్రా, టూల్స్ అందించనున్నట్లు తెలుస్తోంది. "ఇన్నోవేషన్ ఇండియా నుంచి ప్రపంచానికి" అనే లక్ష్యానికి తగిన విధంగా ఈ హబ్‌ను రూపొందిస్తున్నట్లు గూగుల్ వర్గాలు సూచిస్తున్నాయి. మరోవైపు, స్థానిక యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు హార్డ్‌వేర్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్‌మెంట్ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారికి మంచి అవకాశాలు దక్కనున్నాయి. ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు, గ్లోబల్ స్టాండర్డ్ వర్క్ కల్చర్‌ను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రణాళిక సిద్ధమైందని తెలుస్తోంది. ప్రభుత్వ రంగ సేవల్లో కూడా ఈ ఏఐ హబ్ కీలక పాత్ర పోషించనుంది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెల్త్, అగ్రి, ఎడ్యుకేషన్ వంటి విభాగాల్లో ఏఐ ఆధారిత డేటా అనాలిటిక్స్‌ను వినియోగించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అమలు అయితే విశాఖ మాత్రమే కాకుండా మొత్తం దేశానికి కొత్త సాంకేతిక దిశను చూపే కేంద్రంగా రూపుదిద్దుకోనుంది.

## ప్రధాని శ్రీశైలం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**- 1800 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు**

**తొవ్వ ,ప్రతినిధి, అక్టోబర్ 14:** 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకోనున్న నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ ప్రకటించారు. మొత్తం 1800 మంది పోలీసు సిబ్బందిని మోహరించి కీలక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాని హెలిపాడ్‌కు చేరుకునే సమయం నుంచి దర్శనం ముగిసే వరకు ప్రతి మూలను జియోగ్రాఫికల్ మ్యాప్ ఆధారంగా గుర్తించి తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెలిపాడ్, ఆలయ పరిసరాలు, శివాజీ స్ఫూర్తి కేంద్రం, ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి యాక్సెస్ కంట్రోల్ అమలు చేయాలని సూచించారు. రూట్‌మాప్‌పై క్షుణ్ణమైన పర్యవేక్షణ కోసం రూఫ్‌టాప్ టీమ్స్, క్యూఆర్టీ బృందాలు, ప్రత్యేక పహారా బృందాలను నియమించారు. ప్రతి పోలీసు సిబ్బందికి ప్రత్యేక డ్యూటీ పాసులు జారీ చేసి, ఐడీ కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. కీలక పాయింట్ల వద్ద కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం మానిటరింగ్ జరుగుతుందని ఎస్పీ సునీల్ తెలిపారు. శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని 24 గంటల పాటు తనిఖీ చేస్తూ, ఎలాంటి అనుమానాస్పద కదలికను వెంటనే ఉన్నతాధికారులకు తెలుపాలని సూచనలు జారీ చేశారు.

# ఆంధ్రలో విజ్ఞాన దీపం

## - విశాఖలో గూగుల్ ఏఐ కేంద్రంతో కొత్త దిశ

**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 14:**
ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గూగుల్ ఆధ్వర్యంలో ఏఐ హబ్ ఏర్పాటు కావడం దేశ అభివృద్ధి యాత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన వికసిత భారత దృష్టికి అనుగుణంగా గిగావాట్ స్థాయి డేటా సెంటర్ మౌలిక వసతులతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది.ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సాంకేతిక ప్రజాస్వామ్యీకరణ లక్ష్యానికి ఈ హబ్ బలమైన వేదికగా మారనుందని కేంద్ర వర్గాలు భావిస్తున్నాయి. ఆధునిక కృత్రిమ మేధస్సు సాధనాలు ప్రతి పౌరుడి అందుబాటులోకి రావడానికి ఇది మార్గం సుగమం చేస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించి, విశాఖను దేశ సాంకేతిక పటముపై ముందంజలో నిలపడానికి ఈ పెట్టుబడి దోహదం చేయనుంది. ప్రపంచ స్థాయి టెక్నాలజీ కేంద్రాల సరసన భారత స్థానం మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. దేశ ప్రతిభకు కొత్త అవకాశాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు పెట్టుబడుల ఆకర్షణ ఇలా పలు మార్గాల్లో ఈ ఏఐ హబ్ ప్రభావం చాటనుందనే ఆశాభావం ఏర్పడిరది. విశాఖపట్నం భౌగోళికంగా అనుకూలమైన నగరం కావడంతో పాటు, విద్యా రంగంలో కూడా బలమైన మౌలిక వసతులు కలిగి ఉంది. ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో సాంకేతిక నిపుణులు ప్రపంచానికి చేరుకుంటున్న నేపథ్యంలో, ఈ ఏఐ హబ్ వారిలో మరింత నమ్మకం, అవకాశాలు కలిగించనుంది. స్థానిక ప్రతిభను ఉపయోగించుకోవడానికి




సంస్థలు ముందుకు రావటం వలన ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తు సాంకేతికతగా నిలుస్తున్న కృత్రిమ మేధస్సు రంగంలో భారత్ స్వావలంబన సాధించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి ఇది మరో బలాన్నిస్తుంది. గ్రామీణ ప్రాంతాల వరకు సాంకేతిక సేవలు, డిజిటల్ పరిష్కారాలు చేరేలా చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించగలదు. విజ్ఞానం, ఉపాధి, ఆవిష్కరణ ు ఈ మూడు దిశల్లో విశాఖ గూగుల్ ఏఐ హబ్ దేశానికి ప్రేరణగా నిలవనుంది.

# ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ విషాదం

## - రాహుల్ గాంధీ న్యాయం కోసం డిమాండ్

**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 14:**
ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ ఆత్మహత్య దేశ మనసును కదిలించిన విషాద ఘటనగా నిలిచింది. ఒక వారంగా ఆయన భార్య భర్తకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు వేచి చూస్తుండటం హృదయాన్ని కలచివేస్తోంది. ఆమెతో పాటు పిల్లలు, ఈ బాధను అనుభవిస్తున్న దళిత సమాజం గుండెల్లో చోటుచేసుకున్న వేదనను ఊహించుకోవడం కూడా కష్టమేనని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ ఎలాంటి అరెస్టులు జరగకపోవడం స్పష్టమైన అన్యాయమని రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. దళిత కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వ వ్యవస్థ మౌనంగా ఉండటం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం, హర్యాణా ప్రభుత్వాలు స్పందించకుండా ఉండటం హృదయరహితం అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రాజ్యాంగం అందరికీ సమాన న్యాయం హామీ ఇస్తుందని చెప్పుకునే ప్రభుత్వం ఈ కుటుంబపు అరుపును ఎందుకు వినడం లేదని ఆయన నిలదీశారు.ప్రధాని నరేంద్ర మోదీ, హర్యాణా ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని బాధ్యులను శిక్షించి, ఈ దళిత కుటుంబానికి న్యాయం, గౌరవం కల్పించాలని రాహుల్ గాంధీ గట్టిగా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, “ఒక భార్య తన భర్తకు గౌరవప్రదంగా చివరి వీడ్కోలు చెప్పే హక్కు కోసం వారం రోజులుగా నిరీక్షించడం ఈ దేశ వ్యవస్థపై నమ్మకం కలిగిన ప్రతి పౌరుడిని కలవరపెడుతోంది,” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన మన సమాజంలోని అనుసూత్రాలపై, ముఖ్యంగా దళితులపై జరుగుతున్న అన్యాయాలపై మరోసారి దృష్టిని సారించాలని ఆయన పిలుపునిచ్చారు. దళిత



అధికారి మీద జరిగిన మానసిక హింస, అతన్ని ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు పూర్తిగా వెలుగులోకి రావాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఒక ఐపీఎస్ అధికారికి కూడా సురక్షిత వాతావరణం లేకుంటే, సాధారణ దళిత కుటుంబ స్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో న్యాయం ఆలస్యం అయితే అది న్యాయం కాదు అని స్పష్టం చేశారు.ఈ ఘటన కేవలం ఒక కుటుంబం బాధ మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రతి మనసుకు ఇది కఠిన పరీక్ష అని రాహుల్ గాంధీ అన్నారు. దేశాన్ని నడిపించేవారు కేవలం పదవుల్లో ఉండటం సరిపోదని, న్యాయాన్ని నిలబెట్టే బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు. ఇప్పుడు ప్రభుత్వం స్పందించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అన్ని వర్గాలు సమైక్యంగా డిమాండ్ చేస్తున్నాయి.

# సముద్ర మార్గంలో ఉద్రిక్తత

- అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కొత్త మలుపు - నౌకలపై పరస్పర ఛార్జీల యుద్ధం
- అమెరికా జెండా ఉన్న ఓడలకు చైనా ప్రత్యేక ఫీజు - చైనా తయారు చేసిన నౌకలకు మినహాయింపు ప్రకటింపు
- “చర్చలు చేస్తే స్వాగతం, యుద్ధం చేస్తే సిద్ధం” - చైనా స్పందన



**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 14:**
అమెరికా - చైనా మధ్య వాణిజ్య పోటీ ఇప్పుడు సముద్ర మార్గాల్లోనూ ఉద్రిక్తతను పెంచింది. ఇప్పటికే పరస్పరం సుంకాలు, టారిఫ్‌లు విధించుకుంటూ ఉన్న ఇరుదేశాలు ఇప్పుడు ఓడలపై ప్రత్యేక ఛార్జీల దిశగా అడుగులు వేశాయి. అమెరికా జెండాతో సాగర మార్గాల్లో ప్రయాణించే నౌకలపై త్వరలోనే ప్రత్యేక రుసుము వసూలు చేయనున్నట్లు చైనా అధికారికంగా ప్రకటించింది.చెనా ఆసక్తికరంగా ఒక నిబంధనను కూడా అమలు చేస్తోంది. చైనా నిర్మించిన నౌకలకు మాత్రం ఈ కొత్త ఛార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది. దీని ద్వారా తమ దేశ షిప్‌బిల్డింగ్ పరిశ్రమకు ప్రయోజనం చేకూర్చే వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదివరకే అమెరికా కూడా చైనా నౌకలపై ప్రత్యేక ఫీజులను అమలు చేయడంతో, వాణిజ్య యుద్ధం సముద్ర మార్గాలకు చేరింది. అమెరికా తీసుకున్న నిర్ణయాలపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ కఠినంగా స్పందించింది. అమెరికా పోరాటానికి రావాలనుకుంటే తాము సిద్ధంగా ఉన్నామని, అయితే చర్చలకు వస్తే ఆ తలుపులు కూడా తెరిచే ఉన్నామని స్పష్టం చేసింది. ఈ పోటీ సముద్ర రవాణా వ్యయాలను పెంచే అవకాశం ఉందనే ఆందోళన గ్లోబల్ ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.ఈ చర్యలతో అంతర్జాతీయ షిప్పింగ్ రంగంపై పెద్ద ఒత్తిడి రావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా–చైనా వాణిజ్య మార్గాలు ప్రపంచంలో అత్యంత రద్దీగా ఉండే సముద్ర వాణిజ్య మార్గాలు కావడంతో, ఈ కొత్త ఛార్జీల వల్ల ముడిసరుకు రవాణా ఖర్చులు పెరగవచ్చు. దాని ప్రభావం నేరుగా గ్లోబల్ మార్కెట్ ధరలపై పడి, ఇంధనం నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు పలు రంగాల్లో వినియోగదారులు అదనంగా చెల్లించే పరిస్థితి తలెత్తవచ్చని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు పెద్దగా కనిపించని ఈ “సముద్ర సుంక యుద్ధం” వాస్తవానికి భవిష్యత్ ఆర్థిక ఆధిపత్య పోరాటానికి ప్రారంభ సంకేతమని భావిస్తున్నారు. అమెరికా, చైనా మధ్య పెరుగుతున్న ఈ టెన్షన్‌ను ఇతర దేశాలు సైతం నిశితంగా గమనిస్తున్నాయి. ఇరుదేశాలు ఈ యుద్ధాన్ని చర్చల దిశగా తీసుకెళ్తాయా, లేక మరింత ఘర్షణ స్థాయికి చేరుతుందా అన్నది ప్రపంచ ఆర్థిక రంగం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# హర్యానాలో కలకలం..

## పూరన్ కేసులో మరో ట్విస్ట్

- పూరన్‌పై అవినీతి ఆరోపణలు.. దర్యాప్తు చేస్తున్న ఏఎస్సై ఆత్మహత్య
- గన్‌తో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్న సందీప్ కుమార్
- చివరికి విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో సంచలన ఆరోపణలు
- “అతనొక భారీ అవినీతి అధికారి... సత్యం బయటపడుతుందనే భయం” : సందీప్ ఆరోపణ



**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 14:**
హర్యానా రాష్ట్రంలో అదనపు డీజీపీ వై పూరన్ కుమార్ ఆత్మహత్య కేసు చుట్టూ రాజకీయ, పరిపాలనా ఉద్రిక్తతలు ఉధృతమవుతున్నాయి. పూరన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ దర్యాప్తు చేపట్టిన రోహ్తక్ సైబర్ సెల్ ఏఎస్సై సందీప్ కుమార్ మంగళవారం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం రేపింది.చావుకు ముందు సెల్ఫీ వీడియో రికార్డు చేసిన సందీప్ అందులో పూరన్ కుమార్‌ను నేరుగా టార్గెట్ చేస్తూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. “పూరన్ అవినీతికి కొత్త నిర్వచనం. అతని చేతిలో సిస్టమ్ పూర్తిగా కుళ్లిపోయింది. అతనిపై ఉన్న కేసు నిజమని బయటకు రావొస్తోంది... అందుకే భయపడి పూరన్ ఆత్మహత్య చేసుకున్నాడు. నేను సత్యం కోసం జీవితం త్యాగం చేస్తున్నాను” అని వీడియోలో వెల్లడిరచారు. ఈ ఘటనతో హర్యానాలో పోలీస్ విభాగం తీవ్ర ఆందోళనలో పడిరది. వరుస ఆత్మహత్యలతో పూరన్ కేసుకు కొత్త మలుపు తిరిగినట్లు స్థానిక మీడియాలో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఈ రెండూ ఆత్మహత్య కేసులు కలిసి విపరీతమైన దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# ఇందూర్‌లో కెమికల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

- ఉదయం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి కలకలం
- కెమికల్ యూనిట్‌లో మంటలు చెలరేగి స్థానికుల్లో ఆందోళన
- సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది
- పెద్ద ఎత్తున ఆస్తి నష్టం
- అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణహాని లేదు

ప్రమాదానికి గల అసలు కారణంపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు



**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 14:**
ఇండోర్: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని ఒక కెమికల్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో మంగళ ్వారం తెల్లవారురమున భారీ అగ్ని ప్రమాదం సంభవిం చింది. ప్లాంట్ పరిసరాల్లో అకస్మాత్తుగా మంటలు ఎగసిపడటంతో దట్టమైన పొగ వ్యాపించింది. అక్కడి కార్మికులు, స్థానికులు ఆందోళన చెంది వెంటనే పోలీసులకు, ఫైరుసిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక దళం సత్వర చర్య తీసుకుని అనేక ఫైరింజన్‌లను వినియోగించి మంటలను అదుపులోకి తెచ్చింది. అగ్నికీలలు పెద్ద ఎత్తున ఎగిసిపడటంతో ప్లాంట్‌లోని పరికరాలు, నిల్వ ఉంచిన కెమికల్ పదార్థాలు కాలిపోయాయి. ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై అధికారులు దర్యాప్తు ప్రారంభిం చారు. షార్ట్ సర్క్యూట్ కారణమా, లేక కెమికల్ రియాక్షన్ వల్ల మంటలు చెలరేగాయా అన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్న అంశంపై కూడా పరిశీలన జరుగుతోంది.

# తమిళనాడులో శ్రీసన్ ఫార్మసీ లైసెన్సు రద్దు

- కోల్డ్రిఫ్ దగ్గుమందులో విషపదార్థం గుర్తింపు కలకలం
- ప్రాణాంతక డైఇథలీన్ గ్లైకాల్ కలిపిన కోల్డ్రిఫ్ సిరప్‌పై చర్య
- శ్రీసన్ ఫార్మసీ పూర్తిగా మూసివేత
- ఇతర ఫార్మా కంపెనీలపై విస్తృత తనిఖీలు
- డ్రగ్ అధికారులపై కూడా విచారణ ప్రారంభం



**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 14:**
చెన్నై: శ్రీసన్ ఫార్మసిట్యుకల్స్ తయారు చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రమాదకరమైన డైఇథలీన్ గ్లైకాల్ పదార్థం ఉండటంతో, తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ భారీ చర్య తీసుకుంది. సంస్థకు ఉన్న తయారీ లైసెన్సును వెంటనే రద్దు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యప్రదేశ్‌లో చింద్వారా జిల్లాలో ఇటీవల 21 మంది చిన్నారులు ఈ మందు సేవించి మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా ఆగ్రహం రేపిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై అలర్ట్ అవుతూ చెన్నై ల్యాబ్‌లో కోల్డ్రిఫ్ సహా ఇతర తయారీ ఉత్పత్తులను పరీక్షించారు. దర్యాప్తులో డీఈజీ కలిసినట్లు తేలడంతో ప్రభుత్వం నేరుగా సంస్థ మూసివేతకు ఆదేశాలు ఇచ్చింది. 2011లో లైసెన్సు జారీ చేసి, 2016లో రీన్యువల్ చేసిన శ్రీసన్ ఫార్మసీపై ఇక కొనసాగడానికి అవకాశం లేకుండా తలుపులు మూసేశారు. ఈ కేసులో కంపెనీ యజమాని రంగనాథన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో సరిగా తనిఖీలు నిర్వహించని ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేసి, కొందరు ఉన్నత అధికారులపై కూడా ఎడీ సోదాలు ప్రారంభించింది. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డ్రగ్ తయారీ యూనిట్లపై కఠిన తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# పరకామణి చోరీ కేసులో సీఐడీ విచారణ ప్రారంభం

**- సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం**

**- తిరుమల ప్రాంగణంలో పరిశీలనలు, వన్‌టౌన్ స్టేషన్‌లో రికార్డుల సమీక్ష**

**- 2023లో జరిగిన 920 డాలర్లు చోరీ కేసులో విలువైన ఆధారాల సమక్షం**

**- టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి సీఐడీ డీజీని కలిసారు**




**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 14:**
ఆంధ్రప్రదేశు సీఐడీ పరకామణి చోరీ కేసు పై అధికారిక విచారణ ప్రారంభించింది. హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ డ్కెరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం తిరుమల చేరుకొని కేసును పరిశీలించడం ప్రారంభించారు. దీని ద్వారా కేసులో ఉన్న అనేక అనుమానాలు, విచారింపబడని అంశాలు వెలికి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. సీఐడీ బృందం మొదటగా శ్రీవారి ఆలయ పరకామణి ప్రాంగణాన్ని పరిశీలించింది. అక్కడ నుంచే సెల్ సైట్‌లు, సీసీ క్యామరాల ఫుటేజీలు, స్థలంలోని అబద్ధాలేనా అనే విషయాలను సేకరించినట్లు తెలిపారు. అనంతరం తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు ఫైళ్ళను, రిజిస్ట్రేషన్ల వివరాలను గమనించి వివరమైన రికార్డు సమీక్ష మొదలుపెట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 2023 మార్చిలో పరకామణిలో 920 అమెరికన్ డాలర్లు చోరీ కాగా, అప్పటి సమయంలో టీటీడీ ఉద్యోగి రవికుమార్ నిందితుడిగా విలువైన విచారణలో పట్టుబడ్డాడు. అయితే అప్పటి దర్యాప్తులో అనేక ప్రశ్నార్థక అంశాలు ఉండటంతో హైకోర్టు?పు పిటిషన్ దాఖల్కె విచారణను బలవంతం చేసింది.హైకోర్టు విచారణలో పోలీసుల తీరుపై సీరియస్ ఆగ్రహం వ్యక్తమైందిబీ కేసు నిటారుగా పరిశీలించి నిజాలను బయటపెట్టాలని ఆదేశాలు జారయ్యాయి. ఈ నేపథ్యంలో సీఐడీ విచారణకు హైకోర్టు ఆదేశం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ విచారణ పూర్తికాకపోవడం పై ప్రజల్లోనూ, పర్యవేక్షక వర్గాల్లోనూ తీవ్ర ఆందోళన నెలకొన్న ఉంది. టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి సీఐడీ డీజీని కలిసినట్లు, ఆయన వద్ద ఉన్న అదనపు ఆధారాలను సమర్పించారు. సమగ్ర దర్యాప్తు ద్వారా నిందితులను గుర్తించి, అవసరమైతే పరిపాలనలో ఉన్న వారి పొరపాట్లను కూడా వెలికి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని భాను కోరారు.సీఐడీ బృందం దర్యాప్తు కొనసాగిస్తుండగా, స్థానిక ప్రజలు, భక్తుల ఆందోళనను తగ్గించే విధంగా విచారణ సత్వరత్వంతో, పారదర్శకంగా జరగాలని అధికారం హామీ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కేసు పరిణామాలు బయటపడ్డాక తదుపరి చర్యలపై సీఐడీ అధికారులు సముచిత ప్రకటనలు చేస్తామన్నారు.

# బూత్ స్థాయి సమన్వయం ప్రారంభం

**- ప్రచారం ఇంటింటికీ చేర్చే పిలుపు - ప్రతి కార్యకర్త ఒక నాయకుడిలా పనిచేయాలి**

**- యువత, మహిళల పాత్ర కీలకం - కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి సమగ్ర వ్యూహం**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 14:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని బోరబండలో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశం ఉత్సాహంగా జరిగింది. ఏఐసిసి సెక్రటరీ విశ్వనాథన్, పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి సీతక్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా హాజరయ్యారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రాంతీయ నాయకులు విస్తృతంగా హాజరయ్యారు. భారీగా హాజరైన బూత్ కమిటీ ప్రతినిధులను ఉద్దేశించి నేతలు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతి బూత్‌ను పార్టీ శక్తి కేంద్రంగా మార్చాలని, ఇంటింటికి చేరి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడే విధానం విజయానికి దారితీస్తుందని నేతలు అన్నది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పింఛన్లు, విద్యా సాయం, మహిళా అభివృద్ధి చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడానికి పథకాల అమలు వివరాలు సులభంగా అర్థమయ్యే రీతిలో చెప్పే విధానంపై దృష్టి పెట్టాలని చెప్పారు.



**జూబ్లీహిల్స్ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర**

హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను ప్రజలకు గుర్తు చేయాలని నేతలు పిలుపునిచ్చారు. రోడ్లు, నీటి పారుదల, కాలువలు, విద్యుత్ మరియు పౌర సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజా అభిమతాన్ని పొందేలా ప్రచారం చేయాలని సూచించారు.

**ప్రతి కార్యకర్త ఒక నాయకుడిలా పనిచేయాలి**

పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త నాయకత్వ భావనతో వ్యవహరించాలని, బూత్ స్థాయిలో మద్దతు వర్గాలను బలోపేతం చేయాలని నేతలు సూచించారు. ప్రజలతో నిత్యం సంబంధం కొనసాగిస్తూ కాంగ్రెస్ పట్ల విశ్వాసం పెంచాలని సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున చర్యలు తీసుకుంటామని ప్రజలకు నమ్మకం కల్పించాలని అన్నారు. పార్టీలో యువ కార్మికులు, మహిళలు మరింత చురుకుగా ముందుకు రావాలని నేతలు ప్రోత్సహించారు. బూత్ స్థాయిలో మహిళల భాగస్వామ్యంతోనే నిజమైన పార్టీ బలోపేతం సాధ్యమని అభిప్రాయపడ్డారు. స్థానిక మహిళా సంఘాలతో సంభాషణలు పెంచి, వారికి కాంగ్రెస్ కార్యాచరణను చేరవేయాలని తెలిపారు. ఈసారీ జూబ్లీహిల్స్ విజయం బోరబండ నుంచే ప్రారంభం కావాలని నేతలు ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. ప్రతి బూత్ సమావేశం ఒక శక్తివంతమైన మద్దతు వేదికగా మారాలని, గెలుపు కోసం కార్యాచరణ వేగాన్ని పెంచాలని సూచించారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తే కాంగ్రెస్ విజయం ఖాయమని నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు గెలుపు కట్టబెట్టే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ వారీగా ప్రత్యేక బృందాలను నియమించి ప్రచారాన్ని విస్తరించాలని ప్రకటించారు. అభ్యర్థి గెలుపు వ్యక్తిగతం కాదని, అది ప్రజల అభిమతం ప్రతిబింబిస్తుందని నేతలు చెప్పారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు వేడెక్కుతున్న వాతావరణం

**- బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత బరిలో - కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫామ్, చెక్కు అందజేత**

**- కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ సమాయత్తం - బీజేపీ అభ్యర్థి ప్రకటన ఇంకా నిలిపివేత**



**తొవ్వ ,ప్రతినిధి, అక్టోబర్ 14:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రాజకీయ వేడి క్రమంగా పెరుగుతోంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు బీ ఫామ్ అందజేశారు. పార్టీ తరఫున ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యయం కోసం రూ. 40 లక్షల చెక్కును ప్రత్యక్షంగా అందించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మహిళా శక్తి, స్థానిక అభ్యర్థులపై నమ్మకం వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాగంటి సునీతతో పాటు ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ వంటి కీలక నేతలు హాజరై అభ్యర్థికి మద్దతు పలికారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహ వాతావరణం నెలకొంది. ఇక కాంగ్రెస్ పార్టీలోనూ సమీకరణలు వేగంగా జరిగాయి. నవీన్ యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత జూబ్లీహిల్స్‌లో ప్రచార బాట మొదల్కెంది. యువతను ఆకట్టుకునేలా నవీన్ వ్యూహారచనలో నిమగ్నమయ్యారు. బీజేపీ ఇంకా తన అభ్యర్థి పేరును ప్రకటించలేదు.



త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు పార్టీల మధ్య త్రికోణ పోటీ ఆసక్తిని రేపుతోంది.జూబ్లీహిల్స్‌లో నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రస్తుత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. స్థానికంగా సానుభూతి వాతావరణం ఉన్నా రాజకీయ సమీకరణలు ఎలా మలుపు తిరుగుతాయో చూడాలి.మాగంటి సునీత తన ప్రచారాన్ని త్వరలోనే ప్రారంభించనున్నారు. కేసీఆర్ నుండి లభించిన ప్రత్యక్ష బలం బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఇక కాంగ్రెస్, బీజేపీ ప్రచార రంగంలో ఎలాంటి ప్రయత్నాలు చేస్తాయో ఆసక్తిగా మారింది.

## శ్రీశైలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రగతి

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక సమీక్ష**

**- దేవాదాయ శాఖ అవగాహన సమావేశం**

**- అటవీ శాఖతో సమన్వయ చర్యలు - అధికారులకు స్పష్టమైన సూచనలు**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 14:**
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, శ్రీశైలం మాస్టర్ ప్లాన్ అమలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొని రెండు శాఖల మధ్య సమన్వయం బలపరచాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక వసతుల అభివృద్ధి, అడవి సంరక్షణను సమాంతరంగా తీసుకెళ్లే చర్యలపై పవన్ కళ్యాణ్ దృష్టి సారించారు. అటవీ ప్రాంతాల రక్షణతో పాటు యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ప్లాన్ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూసేకరణ, రహదారి విస్తరణ, పార్కింగ్ సదుపాయాలు, తాగునీటి వ్యవస్థ, చెత్త నిర్వహణపై విభాగాల వారీగా సమీక్ష జరిగింది. పవన్ కళ్యాణ్ మాస్టర్ ప్లాన్ అమలులో యాంత్రికత ఉండకూడదని, ప్రాంతీయ ప్రజలు మరియు భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.సమావేశంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి హరి జవహర్‌లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, పీసీసీఎఫ్ చలపతి రావు, అదనపు పీసీసీఎఫ్ శాంతి ప్రియ పాండే తదితరులు హాజరయ్యారు. శ్రీశ్కెలం అభివృద్ధి ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రాధాన్యత ప్రాజెక్టుగా పరిగణిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## సునీత కన్నీళ్లు.. ప్రచారంలో కొత్త వివాదం

**- కృత్రిమ ఏడుపు స్క్రిప్ట్ అంటూ కాంగ్రెస్ సెట్కెర్లు**

**- భావోద్వేగంపై బీఆర్ఎస్.. ప్రతిస్పందనలో కాంగ్రెస్ దూకుడు**



**తొవ్వ ,ప్రతినిధి, అక్టోబర్ 14 :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రహమత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడే టప్పుడు కన్నీళ్ళు పెట్టుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాం శమైంది. ఆమె భర్త మాగంటి గోపీనాథ్‌ను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనవడం సహజమేనని కొంతమంది అంటుంటే, కాంగ్రెస్ మాత్రం ఇది సహజం కాదంటూ కృత్రిమ డ్రామా అంటూ విమర్శలు గుప్పిస్తోంది. బూత్ కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, కేటీఆర్ ఒత్తిడితోనే సునీత వేదికపై ఏడ్చారని వ్యాఖ్యానించారు. ఒక నాయకురాలిని ప్రజల ముందే కన్నీళ్లు పెట్టుకునేలా ప్రేరేపించడం రాజకీయంగా చాలా దారుణమని ఆయన మండిపడ్డారు. ఇలాంటి స్క్రిప్టెడ్ చర్యలతో ఓటర్ల సానుభూతి పొందాలనుకోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా బీఆర్ఎస్ పైన మండిప డ్డారు. ఓ ఆడకూతురు కన్నీళ్లను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం తప్పు అని పేర్కొన్నారు. అధికారానికి అలవాటు పడిన ఈ పార్టీ ఇప్పుడు ప్రతి భావోద్వేగాన్ని ఎన్నికల లాభంలోకి మలచుకోవాలని చూస్తోందని వ్యాఖ్యానించారు.పొన్నం ప్రభాకర్ తర్వాత మీడియాతో మాట్లాడుతూ, మాగంటి సునీత ఏడ్చే తీరు చూస్తుంటే అది సహజంగా అనిపించలేదని అన్నారు. కన్నీళ్ల వెనుక రాజకీయ లెక్కలు కనిపిస్తున్నా యని, ఇది నిజమైన దుఃఖం కాదని తనకు అనిపించిందని తెలిపారు. సానుభూతి పేరు మీద ఓట్లు సాధించాలనే ప్రయత్నం ప్రజలు గుర్తించ లేరని అనుకోవడం పొరపాటు అంటూ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ ఎస్ ప్రచార వ్యూహంలో భావోద్వేగాన్ని ఆయుధంగా ఉపయోగిస్తు న్నారన్న ఆరోపణలతో జూబ్లీహిల్స్ పరిసరాల్లో రాజకీయ ఉద్రిక్తత పెరి గింది. ఈ వ్యాఖ్యలతో ప్రచారం మరింత ఘర్షణాత్మక దిశగా దూసుకెళ్లేలా కనిపిస్తోంది.

## మోతీనగర్‌లో కాంగ్రెస్ ప్రచారం

**కాలనీ ప్రజలతో మీనాక్షి నటరాజన్ టీ అల్పాహారం**

**తొవ్వ,ప్రతినిధి,అక్టోబర్ 14:**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని మోతీనగర్ రాయుడు హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం చురుకుగా కొనసాగింది. పార్టీ ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్థానిక కార్యకర్తలతో కలిసి కాలనీ ప్రజల మధ్యకు వెళ్లారు. ఆమెతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా కార్యక్రమానికి హాజరై ప్రజలతో టీ, అల్పాహారం తీసుకుంటూ మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పులను నాయకులు వివరించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్న నేతలు, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎర్రగడ్డ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ప్రతి కార్యకర్త బలం చేకూర్చాలని నేతలు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, యువ శ్రేణులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచార యాత్రకు ప్రజలు కూడా విశేష స్పందన ఇచ్చారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ దూకుడు

## పాదయాత్రలు, బూత్ స్థాయి సమావేశాలతో ఊపెక్కుతున్న ప్రచారం





**తొవ్వ ,ప్రతినిధి, అక్టోబర్ 14:**
జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ప్రచార యుద్ధానికి దిగింది. అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు కోసం పార్టీ శక్తినంతా రంగంలోకి దింపింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వంలో ఇప్పటికే డివిజన్ వారీ సమీక్షలు పూర్తయ్యాయి. ఈ రోజు నుంచి ప్రతి బూత్‌లో ప్రత్యేక సమావేశాలు మొదలయ్యాయి. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ పార్టీ కొత్తగా చేరిన శ్రేణులతో ప్రచారానికి కొత్త ఊపు వచ్చింది. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వయంగా గ్రౌండ్‌లోకి దిగి డివిజన్ వారీ పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ చేరుకుంటూ ప్రజా అభిప్రాయాన్ని తెలుసుకుంటూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. 22 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బీఆర్ఎస్ పాలనలో దశాబ్ద కాలంలో హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి అనే దిశగా నేతలు చురుకుగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ప్రతి ఓటర్ని వ్యక్తిగతంగా కలవడం లక్ష్యంగా పని చేస్తున్నారు. గ్రౌండ్ స్థాయిలో బూత్ సమావేశాలతో పాటు పాదయాత్రలు కూడా సమాంతరంగా సాగుతున్నాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథాలు, హైదరాబాద్‌కు బీఆర్ఎస్ ఇచ్చిన రూపురేఖలను గుర్తు చేస్తూ ఓటర్ల మద్దతు పొందడమే లక్ష్యం. జూబ్లీహిల్స్ ప్రజలను నేరుగా సంప్రదించడం ద్వారా బీఆర్ఎస్ ప్రత్యర్థులకంటే చాలా ముందంజలో నిలిచిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ ఎన్నికలో కేవలం గెలుపే కాదు – ప్రత్యర్థి జాతీయ పార్టీల డిపాజిట్లు కూడా స్వాధీనం చేసుకునేలా భారీ మెజారిటీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 65 ఏళ్ల పాలనలో కాంగ్రెస్, బీజేపీలు సాధించలేని అభివృద్ధిని బీఆర్ఎస్ కేవలం 10 ఏళ్లలోనే సాకారం చేసిందని ప్రచార బృందాలు ప్రజలకు వివరించుతున్నాయి. వచ్చే శతాబ్దికి నగరాన్ని సిద్ధం చేసిన శక్తి ఒక్క బీఆర్ఎస్‌కే ఉందన్న సందేశాన్ని ఇంటింటికీ చేర్చుతున్నాయి. పాదయాత్రలు సాగుతున్న ప్రతి వీధిలో బీఆర్ఎస్ శక్తి స్పష్టంగా కనిపిస్తోంది. భారీ మెజారిటీతో మాగంటి సునీతను గెలిపించాలనే దృఢ నిశ్చయంతో నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై కదులుతున్నారు.

# గురుకుల నిధులపై హరీశ్‌రావు ప్రశ్నలు

**- గ్రీన్ ఛానెల్ హామీ కేవలం మాటలేనా**

**- పెండింగ్ బిల్లులతో చితికిపోతున్న గురుకులాలు - విద్యార్థుల నిరసనలు ప్రభుత్వ వైఫల్య సూచన**



**తొవ్వ ,ప్రతినిధి, అక్టోబర్ 14:**
మాజీ మంత్రి హరీశ్‌రావు గురుకుల విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామన్న వాగ్దానం కేవలం మాటలకే పరిమితమైందా? అని ప్రశ్నించారు. గురుకులాల్లో చదువుతున్న లక్షలాది బిడ్డల భవిష్యత్తు పై ప్రభుత్వానికి నిజమైన కర్తవ్యబోధ ఉందా? అని నిలదీశారు. రాష్ట్రంలో 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించడం అవమానకరమని వ్యాఖ్యానించారు. వేల కోట్ల ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేస్తూ, విద్యార్థుల కోసం కనీస నిధులు కేటాయించడం కూడా ప్రభుత్వం తప్పించుకుంటుందా? అని ప్రశ్నించారు. గురుకులాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు మీద ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని అన్నారు. గురుకులాల్లో మోటార్ల మరమ్మతులు, భవన అద్దెలు, మెస్ చార్జీలు, కాస్మొటిక్, స్టిచ్చింగ్ ఛార్జీలు వంటి మౌలిక అవసరాలూ నెలల తరబడి పెండిరగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండిరగ్ బిల్లుల కారణంగా కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని, తాత్కాలిక సిబ్బంది వేతనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గురుకులాల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యార్థులు నిరసనలకు దిగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని చెప్పారు. బడులు పట్టాల్సిన పిల్లలు రోడ్లపై సమస్యలు చెప్పుకోవాల్సిన పరిస్థితి రావడం దుర్ఘటనగా అభివర్ణించారు. సమీక్షలు నిర్వహించడం కాదు, సమస్యలకు పరిష్కారం చూపేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఛానెల్ పేరుతో ప్రకటించిన నిధుల విడుదల ఇంకా అమలులోకి రాలేదని గుర్తుచేశారు. ఫోటోలు, ప్రచారాలతో కాకుండా వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. గురుకులాల గౌరవం, నాణ్యత కాపాడాలంటే వెంటనే చర్యలు అవసరమని స్పష్టం చేశారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం తక్షణ స్పందనతో పూర్తి స్థాయి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాలకోసం నిలిపివేయరాదని, విద్యా రంగం పట్ల ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఇదేనని హెచ్చరించారు.

# రుణం పేరుతో భాగ్యనగరంలో మరో పెద్ద మోసం బహిర్గతం

**- వాట్సాప్ లోన్ ఆఫర్‌తో లక్షల మోసం - సెలబ్రిటీ డీపీతో నమ్మబలికిన కేటుగాళ్లు**

**- ముందస్తు ఫీజుల పేరుతో డబ్బు దోపిడీ - సైబర్ పోలీసులు అప్రమత్తం చేసిన హెచ్చరిక**



**తొవ్వ ,ప్రతినిధి,అక్టోబర్ 14:**
హైదరాబాద్ నగరంలో మరోసారి సైబర్ నేరగాళ్లు తమ మోసపూరిత ఆటతీరుతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశారు. బేగంపేటకు చెందిన 30ఏళ్ల వ్యక్తికి లోన్ ఇస్తామని నమ్మబలికిన కేటుగాళ్లు లక్షల్లో డబ్బు పీకేశారు. ప్రభుత్వ యంత్రాంగం వరుసగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, ఈ తరహా కేసులు ఆగడం లేదు. ప్రతి కొత్త పద్ధతితో సైబర్ మోసగాళ్లు అమాయకులను వలలోకి దిస్తున్నారు. ఫౌండర్ సల్మాన్ ఖాన్ పేరుతో వాట్సాప్‌లో ప్రొఫైల్ పెట్టుకుని, రూ.50 లక్షల లోన్ ఇస్తామని ఒక వ్యక్తి బాధితుడిని సంప్రదించాడు. రుణ ప్రక్రియ కోసం ముందుగా రూ.10 లక్షలు ఫీజులు, టాక్స్ పేరిట చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దానికి నమ్మకం వచ్చిన బాధితుడు దశలవారీగా మొత్తం రూ.7.9 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత కాంటాక్ట్ నిలిపేయడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం పూర్తి వివరాలు వెల్లడిరచింది. ఫేక్ ఎన్జీవోలు, తెలియని వ్యక్తుల ప్రలోభాలకు లోనవ్వొద్దని స్పష్టంగా హెచ్చరించింది. ముఖ్యంగా సెలబ్రిటీ డీపీలు, ఆకర్షణీయమైన ప్రొఫైల్‌లు పెట్టి చేసే కాల్స్‌ను ప్రజలు విశ్వసించవద్దని సూచించింది. అసలు లోన్ ప్రక్రియలో ముందస్తు డబ్బు చెల్లింపు అధికారికంగా ఉండదని పోలీసులు మరోసారి స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు మానసిక ఒత్తిడి, తక్షణ సహాయం అనే మోసపూరిత భావనను కలిగించి తక్షణ నిర్ణయాలు తీసుకునేలా చూస్తారని అధికారుల హెచ్చరిక. ధృవీకరించిన బ్యాంకులు, నమోదు చేసిన ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ల ద్వారానే లోన్ కోరాలని సూచించారు. ఫేక్ ఎన్జీవో పేర్లు, పెద్ద పెద్ద హామీలతో చేసే కాల్స్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే స్పందించాలి. డయల్ 1930 లేదా ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారుల పిలుపు. ఆలస్యమైతే డబ్బు ట్రేస్ చేసే అవకాశాలు తగ్గిపోతాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే ఈ తరహా మోసాలకు చెక్ పడుతుందని పోలీసులు స్పష్టం చేశారు.



# బ్రిటన్‌కు ఆపన్నహస్తం

పెట్టుబడిదారులు, వణిక్ ప్రముఖులే కాదు, వివిధరంగాల ప్రతినిధులతో కలిపి మొత్తం నూటపాతికమందితో ఆర్థికరాజధానిలో ముంబైలో కాలూనిన బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ పెద్ద హడావుడి, ఆర్భాటం లేకుండా వచ్చిన పనిముగించుకొని వెళ్ళిపోయారు. బెదిరింపులు, గాండ్రింపులు, హూంకరింపులతో అమెరికా అధినేత ట్రంప్ ఎదుటివారిని అవమానిస్తున్న కాలంలో భారత్%–%బ్రిటన్ వాణిజ్య ఒప్పందం ఉపశమనాన్ని ఇస్తోంది. ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదిగిన భారత్‌తో ఒప్పందాలు కుదర్చుకోవడం బ్రిటన్‌కే ఎక్కువ అవసరమన్న వాదన వాస్తవమే అయినా, సుంకాలూ ప్రతీకార సుంకాల పేరిట మన ఎగుమతులమీద ట్రంప్ కక్షసాధిస్తూ, వీసాల మీద నియంత్రణలతో మన ఉద్యోగులూ విద్యార్థులనూ హింసపెడుతున్న దశలో వాణిజ్యానికే కాదు, మేధస్సుకూ, నైపుణ్యాలకూ అడ్డుగోడలు ఉండబోవని బ్రిటిష్ ప్రధాని హామీ ఇస్తున్నారు. ప్రపంచంలోనే మన అతిపెద్ద మార్కెట్ బ్రిటన్‌కోసం తలుపులు తెరుచుకుంటోంది. ఆర్థికవ్యవస్థల వరుసలో నాలుగోస్థానంలో ఉన్న భారత్‌తో యూకే చేస్తున్న వ్యాపారం స్వల్పం. భారత్ మొత్తం ఎగుమతుల్లో బ్రిటన్ వాటా మూడుశాతం, బ్రిటన్‌నుంచి ఇటు జరుగుతున్నది రెండుశాతమే కనుక, ఇరుదేశాల మధ్యా ఇచ్చిపుచ్చుకోవడానికి ఆకాశమంత అవకాశం ఉంది. ఏదో మేర రాజీలూ రాయితీలతో రేపోమాపో అమెరికాతోనూ ఒప్పందం కుదరవచ్చును కానీ, అంతలోగా సుంకాలనూ శాపనార్థాలనూ కలగలిపి మన మనసులను ట్రంప్ గాయపరచిన దశలో, రక్షణనుంచి సినీరంగం వరకూ అన్నీ పంచుకుందామంటూ స్టార్మర్ సగౌరవంగా ప్రతిపాదించడం బాగుంది. కొన్నిరంగాల్లో బ్రిటన్ పెట్టుబడుల ప్రవేశం గురించి మన ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టంగా లేదన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, అనేకరంగాల్లో భారత్ ఎగుమతులకు అదుపులూ అడ్డంకులూ లేకపోవడం స్వాగతించాల్సిన విషయం. అరడజనుకుపైగా రంగాల్లో బ్రిటన్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టి, రెండుదేశాలూ లాభపడవచ్చునంటున్నారు భారత ప్రధాని మోదీ. మిసైళ్ళు, నౌకల ఇంజన్ల కొనుగోలుతో బ్రిటన్‌తో రక్షణరంగంలో దోస్తీ మరింత హెచ్చింది. మనకంపెనీలు అక్కడ వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నందున, అటునుంచి కూడా ధనప్రవాహం ఉండబోతున్నదట. ఇక్కడి సినీనిర్మాతలు అక్కడ షూటింగ్ చేయడం, అక్కడి యూనివర్సిటీలు ఇక్కడ క్యాంపస్‌లు తెరవడం వంటివి ఆర్థిక ప్రయోజనాలతో పాటు, రెండుదేశాల మధ్యా సాన్నిహిత్యం మరిన్ని రంగాలకు విస్తరించిన సత్యాన్ని తెలియచేస్తున్నాయి. ఉద్యోగవీసాలమీద మీసాలు దువ్వుతూ, విదేశీవిద్యార్థుల ప్రవేశంమీద తమ విశ్వవిద్యాలయాలను ట్రంప్ నియంత్రిస్తున్న తరుణంలో, ఇకపై స్టెమ్ కోర్సుల కోసం బ్రిటన్‌వైపు చూసే విద్యార్థుల సంఖ్య కూడా హెచ్చుతుందట. పరిణామంలో చిన్నదే కావచ్చును కానీ, ఈ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ఉభయ దేశాలనూ దగ్గరచేసింది. వస్తు, సేవల రెండింటిలోనూ మిగులు మనవైపే ఉన్న విషయాన్ని అటుంచితే, యాభైఆరు బిలియన్ డాలర్ల ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఉభయదేశాలూ ఐదేళ్ళలో 120 బిలియన్ డాలర్లు చేయాలనుకుంటున్నాయి. చైనా, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ వంటివి బ్రిటన్‌కు అత్యధికంగా ఎగుమతులు చేస్తూ తొలిస్థానాలు ఆక్రమించిన నేపథ్యంలో భారత్ ప్రధానంగా లబ్ధిపొందగలిగే రంగాలు ఏమిటన్న నిర్ధారణలు ఇప్పటికే జరిగాయి. సుంకాలు దాదాపుగా సున్నా అయిన స్థితిలో ఇప్పటికే బరిలో ఉన్న మిగతాదేశాలతో పోటీపడటానికి మనం విధానపరంగా చేయాల్సిందేమిటన్న విశ్లేషణలూ సాగుతున్నాయి. ఈ ఒప్పందం రేపటిరోజుల్లో అమెరికా, ఈయూలతో చేసుకోబోయే ఒప్పందాలకు మార్గదర్శకంగా ఉపకరించడంతో పాటు, ఎగుమతుల రంగంలో మనం చేపట్టవలసిన సంస్కరణలకు సన్నద్ధం కావడానికీ ఉపకరిస్తుంది. ట్రంప్ టారిఫ్ అస్త్రాలదెబ్బకు మిగతా ప్రపంచమార్కెట్ల అన్వేషణలో పడిన భారతదేశానికి బ్రిటన్ తొలిమెట్టు కాబోతోంది. ఒకపక్క బ్రెగ్జిట్ బాధనుంచి కోలుకోలేక బ్రిటన్ ఇంకా విలవిలలాడుతూంటే, ట్రంప్ తన అస్తవ్యస్థ విధానాలతో మొత్తం ప్రపంచాన్నే చెల్లాచెదురు చేసేశారు. ‘సెటా’తో బ్రిటన్‌కు ఆపన్నహస్తం అందించిన భారతదేశం, అక్కడనుంచి వచ్చిపడే చవుక ఉత్పత్తులతో తాను దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. మన చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, వ్యవసాయం, దాని అనుబంధరంగాలను ఎలా కాపాడుకోవాలో పాలకులు ఆలోచించాలి.

# తేజస్వీపై అభ్యర్థిని ప్రకటించిన జన్‌సురాజ్ పార్టీ



పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రఘోపూర్ నియోజకవర్గం నుంచి పోటీకి ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సిద్ధమవుతుండగా.. ఆయనకు పోటీగా ప్రశాంత్ కిషోర్ సారథ్యంలోని ‘జన్ సురాజ్’ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించింది. ఈ నియోజకవర్గం నుంచి ప్రశాంత్ కిషోర్ స్వయంగా పోటీ చేస్తాయని ప్రచారం జరిగినప్పటికీ ఆ సస్పెన్స్‌కు పార్టీ తెరదింపింది. రఘోపూర్ నుంచి చంచల్ సింహ్ ను తమ అభ్యర్థిగా మంగళవారంనాడు ప్రకటించింది. జన్‌సురాజ్ పార్టీ 65 మంది అభ్యర్థులతో రెండవ జాబితాను సోమవారంనాడు ప్రకటించింది. రఘోపుర్ నియోజకవర్గం అభ్యర్థిని మాత్రం సస్పెన్స్‌లో ఉంచింది. దీంతో ప్రశాంత్ కిషోర్ అక్కడి నుంచి పోటీ చేయడం ఖాయమనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా రఘోపూర్ అభ్యర్థిగా చంచల్ సింహ్ పేరును తాజాగా ప్రకటించింది. జన్‌సురాజ్ పార్టీ ఇంతవరకూ 116 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. సీఎం నితీష్ కమార్ కంచుకోటగా భావించే హర్నాట్ నియోజకవర్గం నుంచి కమలేష్ పాశ్వాన్‌ను బరిలోకి దింపింది. బిహార్‌లో మార్పు జన్‌సురాజ్‌తోనే సాధ్యమనీ, గణనీయమైన ఫలితాలను తమ పార్టీ సాధించనుందని ప్రశాంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.



## దీపావళి పార్టీలో మెరిసిన బీటౌన్ తారలు..

## ప్రత్యేక ఆకర్షణగా నీతా అంబానీ

భారతీయులు అత్యంత ఘనంగా జరుపుకునే పండగల్లో దీపావళి ఒకటి. ప్రస్తుతం ఈ పండగకి వారం రోజులే సమయం ఉండటంతో దేశవ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. ప్రజలు తమ ఇళ్లను అందంగా అలంకరించుకోవడం ప్రారంభించేశారు. వెలుగుల పండగను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపావళి సందడి వారం ముందే వచ్చేసింది. తారలు పార్టీలంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా తన ఇంట్లో.. స్నేహితులు, కుటుంబ సభ్యులకు దివాళి పార్టీ ఇచ్చారు. ఈ పార్టీకి పలువురు బీటౌన్ తారలు హాజరై సందడి చేశారు. కరీనా కపూర్ హేమ మాలినీ, జెనీలియా, కరణ్ జోహార్, రేఖ, ప్రీతి జింటా, అనన్య పాండే, కృతి సనన్, కాజోల్, అదితిరావ్ హైదరి, వాణీ కపూర్, సొనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్, మలైకా అరోరా, సారా అలీఖాన్, ఖుషీ కపూర్, సుహానా ఖాన్ తదితరులు పార్టీకి హాజరయ్యారు. భారత్‌లోనే అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ కుటుంబం కూడా ఈ పార్టీలో మెరిసింది. నీతా అంబానీ రాధిక మర్చంట్ దివాళీ పార్టీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక దుస్తుల్లో అందరినీ ఆకర్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## ఈ వారం ఓటీటీలో సందడే సందడి..

## థియేటర్స్ పరిస్థితి ఏంటి?

దీపావళి పండుగ సందర్భంగా ప్రేక్షకులకి మంచి వినోదం పంచే ఉద్దేశంతో



ఇటు థియేటర్, అటు ఓటీటీలో వైవిధ్యమైన సినిమాలు సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. నవ్వులు, ప్రేమ, స్నేహం నేపథ్యంలో రూపొందిన చిత్రాలు థియేటర్స్‌లో మంచి వినోందం అందించనున్నాయి. ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎం, విష్ణు ఓఐ ప్రధాన పాత్రల్లో నటించిన ఫ్రెండ్‌షిప్ కామెడీ డ్రామా మిత్ర మండలి అక్టోబర్ 16న రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. నీరజ కోన దర్శకురాలిగా పరిచయమవుతూ తీసిన మొదటి సినిమా తెలుసు కదా. సిద్ధు జొన్నలగడ్డ, రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం ట్రయాంగిల్ ప్రేమకథ, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ డ్రామాగా రూపొందింది. అక్టోబర్ 17న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్యూడ్' సినిమా తెలుగులో అక్టోబర్ 17న విడుదలవుతోంది. మమితా బైజు హీరోయిన్. కామెడీ, ఎమోషన్స్ మిక్స్ చేసిన ఫీల్ గుడ్ మూవీగా తెరకెక్కించారు దర్శకుడు కీర్తీశ్వరన్. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన కె ర్యాంప్ అనే రొమాంటిక్ కామెడీ చిత్రం అక్టోబన్ 18న రిలీజ్ కానుంది. జైన్స్ నాని దర్శకత్వం వహించిన ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## హత్య కేసుల శోధనలో..



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 31న శ్రేష్ఠ్‌మూవీస్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం విడుదలకానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి 'ఐయామ్ ది గాయ్' అనే పాటను విడుదల చేశారు. జిబ్రాన్ స్వరపరిచిన ఈ పాటకు సామ్రాట్ సాహిత్యం అందించారు. శ్రీకాంత్, హరిహరన్ ఆలపించారు. ఆద్యంతం ఉత్కంఠను పంచే పరిశోధనాత్మక చిత్రమిదని, ఐదు రోజుల్లో జరిగే వరుస హత్యల తాలూకు కేసులను ఓ పోలీస్ అధికారి ఎలా ఛేదించాడన్నది ఆసక్తికరంగా సాగుతుందని మేకర్స్ తెలిపారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానసచౌదరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, నిర్మాతలు: శుభ్ర, ఆర్యన్ రమేష్, విష్ణు విశాల్, దర్శకత్వం: ప్రవీణ్ కె.

## అరి కథతో పుస్తకం

'అరిషడ్వర్గాల గురించి ఎంతో మంది గొప్పవాళ్లు చెప్పారు కానీ.. వాటిని జయించడానికి పరిష్కారాలను చూపించలేదు. మా సినిమాలో ఆ ప్రయత్నం చేశాం. ఈ సినిమా కథతో త్వరలో ఓ పుస్తకాన్ని తీసుకొస్తున్నాం. ఈ చిత్రానికి విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి ఆదరణ దక్కుతున్నది' అని చెప్పారు దర్శకుడు జయశంకర్. ఆయన నిర్దేశకత్వంలో రూపొందిన 'అరి' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. వినోద్‌వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటించారు. మంగళవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు జయశంకర్..ఈ సినిమా ఇప్పుడే ఓటీటీలోకి రావడం లేదని, థియేట్రికల్ రన్ పూర్తయ్యాకే ఓటీటీ డేట్ ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## నల్ల బంగారంగా సంయుక్త

విరూపాక్ష, సార్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ మందారం సంయుక్త మీనన్ త్వరలో 'బ్లాక్ గోల్డ్'గా తెరపైకి రానున్నది. 'చింతకాయల రవి' చిత్రంతో దర్శకునిగా పరిచయమైన యోగి చాలా విరామం తర్వాత ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇదో లేడీ ఓరియెంటెడ్ మూవీ. ఈ సినిమాకు ముందు భైరవి, రాక్షసి అనే పేర్లు పరిశీలించారు. వాటికంటే 'బ్లాక్ గోల్డ్' అయితే.. జనంలోకి తేలిగ్గా వెళుందన్న ఆలోచనతో దీన్ని ఫిక్స్ చేసినట్టు సమాచారం. సినిమా దాదాపుగా సగంపై పూర్తయింది. ఓ గ్లింప్స్ కూడా సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఆ గ్లింప్స్‌తోపాటే టైటిల్‌ను కూడా రివీల్ చేసే అవకాశం ఉంది. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# నేషనల్ హైవే పనులు సజావుగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్**



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 14:
మండలంలో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు పనులు సజావుగా జరిగే విధంగా మహబూబాబాద్ జిల్లా అదన కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులు, నిర్మాణ పనులు, భూములు కోల్పోయిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం నిబంధనల మేరకు భూముల విలువల ఆధారంగా చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు రైతుల సమన్వయంతో నేషనల్ హైవే అధికారులు మెలగాలని సూచించారు. రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమీక్ష లో స్థానిక తహసిల్దార్ చందా నరేష్, ఆర్ ఐ ధారా రామకృష్ణ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ అండర్ -23 అథ్లెటిక్ క్రీడల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే,మేయర్,కమిషనర్..

**మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం..**

**అథ్లెటిక్ నిర్వాహనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగ నిధులు మంజూరు**



తొవ్వ హన్మకొండ ,అక్టోబర్ 14:
ఈ నెల 16 వ తేదీ నుంచి 18 వరకు హనుమకొండ జవహర్ స్టేడియం వేదికగా జరగనున్న అండర్ – 23 జాతీయ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని మున్సిపల్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు సూచించారు. మేరకు నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, కమిషనర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ ,అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు గార్లతో కలిసి పరిశీలించారు.వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వస్తున్న నేపథ్యంలో మంచినీరు,వైద్య మరియు పరిశుభ్రత,లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.అథ్లెటిక్ నిర్వహణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.భద్రత పరమైన ఏర్పాట్లను పోలీస్ శాఖ వారు పర్యవేక్షణ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అశోక్,డిప్యూటీ కమిషనర్ రవీందర్,MHO రాజిరెడ్డి,EE రవీందర్ ,DE సారంగం మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మిక సంఘం వలిగొండ మండల 4వ మహాసభను జయప్రదం చేయండి.



**యాదాద్రి జిల్లా :వలిగొండ: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 14:**
ఈనెల 18వ తేదీన సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో జరిగే కల్లుగీత కార్మిక సంఘం వలిగొండ మండల మహాసభను జయప్రదం చేయాలని కల్లు గీత కార్మికసంఘం రాష్ట్ర కమిటి సభ్యులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు లు పిలుపునిచ్చారువలిగొండ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కల్లుగీత కార్మికులను కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు పబ్బతి మల్లేశం, కోశాధికారి పలుసం స్వామి, నాయకులు రేఖల లక్ష్మీనారాయణ ,కొండూరు సత్తయ్య ,గ్రామాలలోని సొసైటీ అధ్యక్షులు కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ ఫార్మర్ ఫిజులు పోతే సిబ్బంది కి సమాచారం ఇవ్వండి

**పొలం బాట కార్యక్రమంలో ఏ ఈ పాండు**



తొవ్వ, నరసింహుల పేట, అక్టోబర్. 14:
మండలంలోని పకీరా తండ గ్రామపంచాయతీ శివారు బొడ్డి తండాలో విధ్యుత్ శాఖ వారి ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా నరసింహులపేట విధ్యుత్ ఏఈ రమావత్ పాండు మాట్లాడుతూ రైతులకు విద్యుత్ ప్రమాదాల గురించి మరియు భద్రతల గురించి వివరిస్తూ మీ యొక్క పంట పొలాల వద్ద ప్రమాదకరంగా ఉన్న లైన్లు మరియు విధ్యుత్ ప్రవహించే ఎటువంటి వైరు (లైన్) తెగిపడిన అలాగే ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఫీజులు పోయిన మీరు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి తప్ప నేరుగా వేసినచో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కనుక ఎటువంటి అంతరాయం కలిగిన మీరు మరమ్మత్తులు చేయకుండా మీ దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని విద్యుత్ శాఖ వారు రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణ కొరకు సహకరించాలని రైతులను కోరారు. ఇట్టి కార్యక్రమంలో ఏ ఈ పాండు తో పాటు లైన్ ఇన్స్పెక్టర్ కిషన్ మరియు సిబ్బంది సుధాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూస బాలకిషన్ జన్మదిన వేడుకలు



యాదాద్రి జిల్లాబీరామన్నపేట: తోవ్వ ప్రతినిధి అక్టోబర్ 14:
రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస బాలకిషన్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హజరై కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యకి తొలి మెట్టు అంగన్ వాడీ కేంద్రం

**మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**



తొవ్వ,కేసముద్రం, అక్టోబర్ 14:
విద్యకి తొలి మెట్టు అంగన్ వాడీ కేంద్రాలు అని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు.కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని రైతు వేదిక నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించిన మేరకు పోషణ మాసం కార్యక్రమం ఉమ్మడి కేసముద్రం మండలంలోని నాలుగు క్లస్టర్ల ను కలిపి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెప్పడం జరిగింది. గర్భిణీ స్త్రీ పేరు నమోదు చేసిన నాటినుండి పోషణ గురించి వివరిస్తూ ఏ సమయానికి ఏ టీకాలు తీసుకోవాలో గర్భిణీ స్త్రీలలో రక్తహీనత సమస్య రాకుండా గర్భిణీ స్త్రీలు నార్మల్ డెలివరీ అయ్యేటట్లుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని. పిల్లలు జన్మించి తర్వాత వారికి పోలియో మరియు ఇతర టీకాలు సరియైన సమయానికి ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలియో రహిత ఆరోగ్య తెలంగాణ ఏర్పాటు అయ్యే దిశగా పనిచేయాలని, 18 సంవత్సరాలు నిండకుండా బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారంగా చిన్న పిల్లలను పనిలో ఉండకుండా బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు విక్రయించకుండా, మరియు అబార్షన్లు చేసుకోకుండా చూడాలని, ఆడపిల్లలను సంరక్షించే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్నటువంటి గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సంబంధించిన గుడ్లు, పాలు, తప్పు దినుసులు, బాలామృతం వారికి అందే విధంగా చూడాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ శిరీష, ఎమ్మార్వో జి.వివేక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నంబి కిషోర్ ఏవో వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, ఆర్టిఏ మెంబర్ రావుల మురళి, బండారు వెంకన్న, గుగులోత్ దస్రు నాయక్, బండారు దయాకర్, అంగన్వాడి సూపర్వైజర్లు దుర్గ, ప్రేమ జ్యోతి, పద్మావతి, విజయ, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ పాస్ వద్ద వర్షపు నీటి సమస్యను పరిష్కరించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య**



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 14 :
రామన్నపేట –కొమ్మాయిగూడెం అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి వద్ద వర్షం వచ్చినప్పుడు ప్రయాకులకు ఇబ్బంది కలగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం స్థానిక రైల్వే స్టేషన్లో ఎస్ఎస్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే అండర్ పాస్ ముందు చూపు ప్రణాళిక లేకుండా నిర్మించడంతో వర్షం పడిన ప్రతీసారి ప్రయాణాలు స్తంభించిపోతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు హైదరాబాద్ వెళ్ళడానికి ఈ రహదారే ప్రధానం వర్షపు నీరు రావడంతో నిత్యం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందని వెంటనే రైల్వే అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించి నీటిని తొలగించాలని అన్నారు. లేని పక్షంలో ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు, నాయకులు ఎర్ర కాటమయ్య, అంతటి సత్తయ్య, గుణగంటి మల్లేశం, శానగొండ రాము, ఆవనగంటి శేఖర్, ఆకిటి మల్లేశం, ఆకిటి శ్రీను, జల్లెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# చేనేత జాతి చైతన్యం కోసం సమాయత్తం

**రాష్ట్ర చేనేత ఐక్య వేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్**




యాదాద్రి జిల్లా:రామన్నపేట, తొవ్వ ప్రతినిధి:అక్టోబర్ 14
చేనేత జాతి చైతన్యం కోసం సమాయత్తం అవ్వాలని దాని కోసం అన్ని జిల్లాలు పర్యటించి అందరిని ఆహ్వానించే ప్రయత్నం చేస్తానని తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నాడు స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో సంక్రాంతి తర్వాత తెలంగాణ చేనేత కళాకారుల మేళా నిర్వహిస్తామని ప్రాచీన కళ చేనేత పరిశ్రమ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రం లో ఉన్న చేనేత కళాకారులను, పద్మశాలి నాయకు లు, కవులు, కళాకారులు, రాజకీ య నాయకులు వివిధ హోదాల లో ప్రభుత్వం లో ఉన్న అధికారు లను ఒకే వేదిక మీద తెచ్చి చేనేత భవిష్యత్తు గూర్చి పెద్దఎత్తున మేళా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. చేనేతకు హితోదిక సహాయ సహకారాలు అందించే వివిధ సామాజిక స్పృహ ఉన్న నేతలను కూడా ఆహ్వానిస్తామని తెలియజేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీల చేనేత విభాగాల పెద్దలు చేనేత కార్మిక సంఘాలు అందరిని కలుపుకుని పెద్ద ఎత్తున సభ నిర్వహణ జరుగుతుందని ఆయన వెల్లడించారు.

## జనంపల్లి గురుకుల పాఠశాలలో అవగాహన సదస్సు



యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 14:
.బాలికల అన్ని రంగాలలో ముందుండాల ని, సంరక్షణ ఎంతో అవసరమని మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు రామన్నపేట మండల పరిధిలోని తెలంగాణ గురుకుల పాఠశాల %d% కళాశాల నందు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా వారి అదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో పాఠశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ నాగమణి సమక్షంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సందర్శించి, ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డ, లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం లు కలిసి అంతర్జాతీయ బాలికల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ అవగాహన సదస్సు కి మొత్తం 460 విద్యార్దులు హాజరైనారు. హాజరైన విద్యార్థులకి బాలికల చట్టాలు, బాల్య వివాహాలు, పొక్సో చట్టం, మహిళల రక్షణ, సంరక్షణ, విద్య, వైద్యం, సమాన హక్కులు, లింగ వివక్ష, తదితర అంశాలపై అవగాహన కల్పించడం కల్పించారు. అనంతరం విద్యార్థులకి కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, భోజన సదుపాయం పరిశీలించి, చదువు తో పాటు చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ నుండి రాఘవేందర్, వెంకట్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీతా కార్మిక సంఘం మండల మహాసభలో నూతన కమిటీ ఎన్నిక

### కేజీకేఎస్ నూతన మండల అధ్యక్ష కార్యదర్శులుగా వీరగాని మల్లేశం గౌడ్, శీలం సత్యనారాయణ గౌడ్



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 14
కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మండల కేంద్రానికి చెందిన వీర గాని మల్లేశం గౌడ్, రామానుజాపురం గ్రామానికి చెందిన శీలం సత్యనారాయణ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యమగాని వెంకన్న గౌడ్, గౌని వెంకన్న గౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం (కేజీ కేఎస్) మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండలకమిటీని ఎంపిక చేశారు. ఆ వివరాలను వెల్లడించారు. మండల గౌరవాధ్యక్షులుగా శ్రీరామగిరి గ్రామానికి చెందిన గొల్లపల్లి యాదగిరి గౌడ్, మండల అధ్యక్షులు వీరగాని మల్లేశం గౌడ్ ఉపాధ్యక్షులు పేరుమాండ్ల వెంకన్న బైరు యుగంధర్ మండల ప్రధాన కార్యదర్శి శీలం సత్యనారాయణ సహాయ కార్యదర్శులుగా కోటగిరి అశోక్, బత్తిని అశోక్ సోషల్ మీడియా మండల కన్వీనర్ వీరన్న కో కన్వీనర్ పొన్నం మహేష్ కమిటీ సభ్యులు శీలం లక్ష్మయ్య, పల్లె వెంకట్ రాములు బండపల్లి వెంకన్న వెంకటలక్ష్మి, కోటగిరి గుంశావళి, వీరన్న లను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలోని గౌడ కులస్తుల అభివృద్ధి కోసం, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సంఘం సభ్యుల సహకారంతో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షులు రాగిపెల్లి వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు తదితరులున్నారు.

## పి.డి.ఎస్.యు రాష్ట్ర 4వ మహసభలను విజయవంతం చేయండి.

### పి.డి.ఎస్.యూ రాష్ట్ర నాయకులు జె.గణేష్.



బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 14.:
ఈనెల 28,29,30 తేదీలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) రాష్ట్ర మహాసభలు వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభల సందర్భంగా, మంగళవారం మండల కేంద్రంలోని పలు విద్యాసంస్థలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథిగా గణేష్ మాట్లాడుతూ, విద్యార్థి ఉద్యమాలలో త్యాగాల చరిత్ర కలిగిన విప్లవ విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యూ అని ,శాస్త్రీయ విద్యా సాధన లక్ష్యంగా,సమ సమాజ స్థాపనే ధ్యేయంగా ఉద్యమిస్తూ 50 వసంతాలను పూర్తి చేసుకుందని, విద్యారంగంలో కనీస వసతుల ఏర్పాటుకై,సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలను నిర్వహించాలని పిలుపు నిచ్చారు .విద్యా వ్యాపారికరణ, కాషాయికరణలను వ్యతిరేకిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తూ పోరాట తెగువ చూపిస్తూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 4వ మహసభలను వనపర్తి జిల్లాలో మూడు రోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సందీప్,సంపత్, మనోజ్, స్రవంతి, శ్రీలక్ష్మి, సరస్వతి, వర్షిత, సిద్దు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్ కల్పన జరగకపోతే ప్రభుత్వాలను గద్దె దించుతాం

### సిఐటియు జిల్లా నాయకులు పెరుమాండ్ల బాబుగౌడ్

### రిజర్వేషన్ కల్పించకుంటే మరో తెలంగాణ ఉద్యమానికి సిద్ధం

### బీసీ సంఘాల ఉద్యమ పిలుపుకు మద్దతు ప్రకటించిన వామపక్ష పార్టీలు



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 14
బీసీల జనాభా ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 42 శాతం రిజర్వేషన్ కల్పించకుంటే ప్రభుత్వాలను గద్దె దించడం ఖాయమని సిఐటియు జిల్లా నాయకులు పెరుమాండ్ల బాబు గౌడ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో వామపక్ష పార్టీల నేతల తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో కలిసి మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం కుల గణనలో బీసీలు 57% ఉన్నారని వారికి 42% రిజర్వేషన్లు కల్పిస్తామని చట్టసభలలో ఆమోదం తెలిపి రాష్ట్ర గవర్నర్ కు బిల్లు పంపినప్పటికీ ఆమోదం చేయకుండా జాప్యం చేస్తున్నారని, అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే జనాభాలో 57% గా ఉన్న బీసీలకు న్యాయం చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పార్టీలు సంఘాలు ఐక్యంగా ముందుకు రావాలన్నారు. బీసీల రిజర్వేషన్లు కల్పించకపోతే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసినట్లే బీసీ సాధన కోసం ఉద్యమం జరగడం ఖాయమన్నారు. ఏడు శాతం ఉన్న ఈ బీసీలకు 10% రిజర్వేషన్లు కల్పించి కేంద్ర ప్రభుత్వం భూస్వామ్య వర్గాలకు పెద్దపీట వేసిందన్నారు. జనాభాలో మేమెంతో మాకంత రిజర్వేషన్లు కల్పించాలని ఏళు గా కొట్లాడుతున్నామని ప్రభుత్వాలు బీసీల పట్ల కపట ప్రేమ వ్యక్తం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలాడడం మాని రిజర్వేషన్లను అమలుపరిచే విధంగా కృషి చేయాలి అన్నారు. ఎందుకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అందుకు బీసీలంతా కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు, ఏఐటీయూసీ మండల నాయకులు చిర్ర సత్యనారాయణ గౌడ్, పి వై ఎల్ జిల్లా నాయకులు ఇరుగు అనిల్, ఆ శోద యాకూబ్ మైనార్టీ నాయకులు సర్దార్ పాషా తదితరులున్నారు.

## వర్షానికి తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వమే మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలి.

### -ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు.

బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 14.
మండలంలో అకాల వర్షానికి అనేక చోట్ల రోడ్డుపై ఆరబెట్టి విక్రయానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట తడిసి ముద్ద అయిపోయింది.అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి యూరియా కొరత వలన పంట దిగుబడి తగ్గిపోయి పెట్టిన పెట్టుబడి అయిన వస్తదా రాదా అని ఆందోళన చెందుతున్న సమయంలో అకాల వర్షం వలన మూల్గే నక్కపై తాటిపండు పడ్డ చందంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసిందని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు.పంటల భీమా పథకం ఉన్నప్పటికీ రైతులకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదని కాగితాలకే పరిమితమైందని,రైతాంగానికి పంటల భీమపథకాన్ని అమలు చేయాలని అనేక ఉద్యమాలు చేసినప్పటికీ కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం వ్యవసాయ రంగాన్ని,రైతాంగాన్ని ఆదుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు భీమపథకం అమలుకు పూనుకోవడం



లేదని విమర్శించారు.రైతులు పండించిన అన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చెయ్యాలని,ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం మద్దతు ధరకు తడిసిన,రంగు మారిన మొక్కజొన్న పంటను మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని,అలాగే పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించాలని,ప్రైవేటు వ్యాపారస్తుల దోపిడిని అరికట్టాలని ప్రభుత్వాన్ని అఖిలభారత రైతు కూలి సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### కార్యకర్తల అభిప్రాయ సేకరణతోనే డీసీసీ ఎన్నిక

### కాంగ్రెస్ లో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు

### వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



తొవ్వ ,హన్మకొండ ,అక్టోబర్ 13:
అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని లలితా కన్వెన్షన్ లో స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ప్రజాక్షేత్రంలోకి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి పనిచేసిన అర్హులకు అవకాశాలు లభిస్తాయని



తెలియజేశారు. యువత, మహిళలు, గిరిజనులు, అణగారిన వర్గాల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. కులం, మతం, ధనం వంటి వాటితో సంబంధం లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, మండల, పట్టణ డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఫ్రంటల్ ఆర్గనైజర్స్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు,వార్డు, గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

తొవ్వ,గార్ల అక్టోబర్ 14బీ
చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన గార్ల మండలం గోపాలపురం గ్రామంలో చోటు చేసుకుంది. కాంపాటి కోటమ్మ తన కుమారుడు కాంపాటి ఉపేందర్(32)సోమవారం నాడు అదే గ్రామానికి చెందిన నర్సయ్యతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న అప్ప సముద్రం చెరువుకు చేపల వేటకు వెళ్ళడని రాత్రి నరసయ్య ఒక్కడే తిరిగి వచ్చాడని తన కొడుకు రాలేదని చెరువు దగ్గరకి వెళ్ళి చూడగా చెప్పులు,సంచి అక్కడే ఉండగా అనుమానం వచ్చి గ్రామస్తులతో చెరువులో గాలించగా తన కొడుకు శవమై తేలి చనిపోయాడని,కొడుకు తో పాటు వెళ్ళిన నరసయ్యను అడగగా చెరువు లో వల ప్రమాదవశాత్తు కాలికి తగిలి చుట్టుకొని చనిపోయి ఉంటాడని అన్నాడని,నర్సయ్యను విచారించి తగు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ కి వచ్చి పిర్యాదు చేసింది. ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేసి విచారణ చేస్తామని ఎస్ ఐ రియాజ్ పాషా తెలిపారు.

# తప్పిపోయిన బాలికను తల్లి కి అప్పగించిన ఆర్టీసీ నర్సంపేట డిపో ఉద్యోగులు.



నర్సంపేట, అక్టోబర్ 14, తొవ్వ న్యూస్:
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో ఉద్యోగులు కండక్టర్ కొలిపాక రాంబాబు, డ్రైవర్ శ్రీను డ్యూటీ లో వరంగల్ బస్టాండ్ నుండి నర్సంపేట కి వచ్చుచున్న క్రమంలో స్కూల్ యూనిఫామ్ లో ఉన్న అమ్మాయి ని చూసారు. ఆమె ఉదయం ఇదే బస్సు ఎక్కి మళ్ళీ తిరుగు ప్రయాణం కొరకు అదే బస్సు ఎక్కింది. అనుమానం వచ్చి అమ్మాయిని వివరాలు అడగగా ఆమె గట్టి గీత మాధురి, వయస్సు 11స::రాలు, కొత్తగూడ మండలం ముస్మి గ్రామం అని చెప్పింది. స్కూల్ కి వెళ్లకుండా ఆమె వరంగల్ వచ్చింది. కండక్టర్, డ్రైవర్ గార్లు అమ్మాయికి భోజనం పెట్టి వారి తల్లి ఫోన్ నెంబర్ అడిగి ఫోన్ చేసి సమాచారం అందింది నర్సంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ ఆదేశానుసరం డిపో సెక్యూరిటీ హెడ్ వీరారెడ్డి, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఆర్ టిహరిప్రసాద్ మరియు సూపర్ వైజర్ల సమక్షంలో అమ్మాయిని తల్లి కి అప్పగించడం జరిగింది. వారు డిపో అధికారులకు ధన్యవాదములు తెలియజేసారు.

# రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలి.

## జిల్లా విద్యాశాఖ అధికారి .బహునూతుల రంగయ్య నాయుడు.



**చెన్నారావుపేట, అక్టోబర్ 14, తొవ్వ న్యూస్:**
చెన్నారావుపేట మండలం లోని కేజీబీవీ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బి.రంగయ్య నాయుడు ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్శనలో విద్యార్థుల హాజరు,ఉపాధ్యాయుల హాజరు పలు రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల తరగతి బోధనను పరిశీలించారు.అలాగే పాఠశాల లోని వంట గది ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ను పెట్టాలని తెలిపారు.పాఠశాల లో వున్న స్టోర్ రూం ను తనిఖీ చేసి తాజా కూరగాయలు , వంటనూనెలనుపరిశీలించారు.అలాగే ఐ ఎఫ్ . ఎల్ ప్యానెల్ ,ఖాన్ అకాడమీ,సైన్స్ ల్యాబ్ ల గురించి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.అలాగే వికసిత భారత్ బిల్డ్ దాన్ 2025 నందు పాఠశాల వివరాలను నమోదు చేయాలని తెలిపారు.అలాగేవిద్యార్థులతో డి ఈ. ఓ. మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలి అని తెలిపారు. అలాగే జయముఖీ కాలేజ్ యందు ఫిజికల్ సైన్స్ మరియుమ్యాథ్స్ఉపాధ్యాయులు కు డిజిటల్ లెర్నింగ్ పై జరుగుతున్న ఒరియెంటేషన్త రగతులను ప్రారంభించారు.ఈతరగతులనుఉపాధ్యాయులు సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉంద్రాతి సుజన్ తేజ , కేజీబీవి స్పెషల్ ఆఫీసర్ మిట్టపల్లిజ్యోతి ,ఉపాధ్యాయుని లు రాజేశ్వరి,యశోద మరియు సిఆర్పి సంపత్ తదితరులు పాల్గొన్నారు

# యువతకు అవకాశం ఇవ్వాలి

## డిసిసి పీఠం రేసులో యువనేత నెలకుర్తి నరేష్ రెడ్డి



తొవ్వ ,నర్సింహులపేట అక్టోబర్ 14:
మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం డోర్నకల్ నియోజకవర్గం నుండి పోటీ పడుతున్నారు నెల కుర్తి నరేష్ రెడ్డి నరసింహుల పేట మండలం జయపురం గ్రామానికి చెందిన నెలకుర్తి నరేష్ రెడ్డి విద్యార్థి దశ నుండే రాజకీయాలలో చురుకుగా పాల్గొంటూ కాంగ్రెస్ పార్టీ లో వివిధ దశలలో తనదైన శైలిలో ముద్రవేస్తూ 2007వ సంవత్సరంలో రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ జనరల్ సెక్రటరీగా, 2009లో హైదరాబాద్ ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్



జనరల్ సెక్రటరీగా, 2010లో హైదరాబాద్ సిటీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా, 2012లో మహబూబాబాద్ లోకసభ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు, 2015 లో యూత్ కాంగ్రెస్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు చివరగా 2017 సంవత్సరంలో డోర్నకల్ పిసిసి మెంబర్ గా ఎన్నికై వివిధ దశల్లో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొంటూ పార్టీ కార్యక్రమాల్లో తన సేవలను అందిస్తూ, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ ఎదిగిన నరేష్ రెడ్డి ఏఐసీసీ పరిశీలకులు, నెంబర్లు స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో జిల్లా అధ్యక్ష పదవి పీఠం కోసం నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా అధ్యక్ష పదవి ఎప్పుడు మహబూబాబాద్ నియోజకవర్గానికి చెందిన వారికే వస్తుందని ఈసారి డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన వారికి అవకాశం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలో ఎమ్మెల్యేలు,పార్లమెంటు సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్, జడ్పీటీసీలు అన్ని పదవులు షెడ్యూల్ ట్రై బ్ వారికి రిజర్వ్ అయి ఉండడం వల్ల పార్టీ పరంగా జిల్లా అధ్యక్ష పదవి జనరల్ కు కేటాయించే అవకాశం ఉన్నందున పార్టీ కోసం విద్యార్థి దశ నుండే వివిధ స్థాయిల్లో కష్టపడుతున్నానని, ఇకనైనా పార్టీ నన్ను గుర్తించి జిల్లా అధ్యక్ష పదవికి నామినేట్ చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు

# ఘనంగా బిజెపి నాయకులు వెంకటేశ్వరాచారి చారి జన్మదిన వేడుకలు

యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 14



రామన్నపేట పట్టణ కేంద్రంలో బిజెపి జిల్లా నాయకులు విశ్వకర్మ జిల్లా ఉపాధ్యక్షులు కన్నగంటి వెంకటేశ్వరాచారి పుట్టినరోజు వేడుకలు స్వగృభంలో ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొమ్ము యాదయ్య, కట్కూరు బిక్షపతి, సిందం లింగయ్య, ఏలూరు రవి, డోగిపర్తి భాస్కర్, కోనూరు సుధాకర్, కోడారి వెంకన్న , కొమ్ము రాజు, నకరికంటి సుదర్శన్, చింతల కృష్ణ, సురివి హరిబాబు గౌడ్ ,గుంటోజు కృష్ణమాచారి, గొండల అంజయ్య, ఎండి నజీర్, బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలు నిర్వహించారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులకు ఆన్ లైన్ లో దరఖాస్తులు ఆహ్వానం




హైదరాబాద్, అక్టోబర్ 14: తెలంగాణలో విద్యార్థులు ఉద్యోగాల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సుల ఆన్ లైన్ లో శిక్షణకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందిన నేషనల్ స్కిల్ అకాడమీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకట రెడ్డి తెలిపారు. డిప్లొమా, పీజీ డిప్లొమా, మాస్టర్ ప్రోగ్రాంలలో కోర్సులు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇంటర్ పాస్ నుంచి పీజీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 5 నుంచి 10 నెలల వ్యవధిలో కోర్సులు పూర్తి అవుతాయాని తెలిపారు. కోర్స్ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో సర్టిఫికెట్ జారిచేస్తామని పేర్కొన్నారు. ఏఐ రంగంలో నైపుణ్యాలు పెరుగుతున్నప్పటికీ సాఫ్ట్వేర్, ఐటీ, ఫైనాన్స్, హెల్త్ కేర్, మీడియా, ప్రభుత్వ, రక్షణ, వ్యవసాయం, రిటైల్, గేమింగ్, విద్య వంటి రంగాల్లో నైపుణ్యాల డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం రాబోయే ఐదు సంవత్సరాల్లో 40 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు ఏఐ రంగంలో సృష్టించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు సెల్ నెంబర్: 9505800050 లో సంప్రదించాలని ఆయన కోరారు.

# పాలకుర్తి నియోజకవర్గానికి మహర్దశ..

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషితో తాండలకు,గ్రామాలకు 24 కోట్ల 30 లక్షల రూ, బీటీ రోడ్లు మంజూరు..



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 14:**
పాలకుర్తి నియోజకవర్గానికి మహర్దశ..పట్టబోతున్నట్టు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు , నియోజకవర్గ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడిందని . ఎస్సీ, ఎస్టీ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన , నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి అంశాలపై పలు ప్రతిపాదనలు సమర్పించారు.వివిధ మండలాల్లోని తాండాలు, గూడాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని తెలిపారు. దానికి సంబంధించిన ?24 కోట్ల 30 లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ ఉత్తర్వులు (జీ.ఓ) ను మంత్రి ఎమ్మెల్యే కు అందజేశారు. గతంలో 6 కోట్లు రూ, తో కుడితే మొత్తం 30కోట్ల 30 లక్షల రూ, పాలకుర్తి నియోజకవర్గానికి అందించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మంత్రి గారి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు

# తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలే

## – వాతావరణ శాఖ హెచ్చరిక



రాష్ట్రంలో మళ్ళీ వర్షాల దోరణి కొనసాగనుంది. నైరుతి రుతుపవనాలు పూర్తిగా ఉపసంహరణ దశలోకి వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఈశాన్య రుతుపవనాల ప్రారంభం దాదాపుగా ఖాయమని తెలిపింది. ఈ మార్పుల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాల ప్రభావం కనిపించనుందని సూచించింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు దూసుకురావచ్చని హెచ్చరించింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు, పంటచేలు లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశముందని తెలిపింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరంలేకుండా బయట తిరగవద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. గడచిన 24 గంటల్లో ములుగు, భూపాలపల్లి, హన్మకొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని నివేదికలు వెల్లడించాయి. కొన్ని మండలాల్లో ఒక్కసారిగా కుండపోతలా వర్షం పడటంతో రహదారులు జలమయం అయ్యాయి. రుతుపవన మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు కూడా తగ్గే అవకాశముందని వాతావరణశాఖ పేర్కొంది. తెల్లవారుజామున చల్లని గాలులు వీస్తాయని, సాయంత్రాలు కూడా చల్లగా ఉండే అవకాశముందని తెలిపింది.